ప్రజా సేవలో రెవెన్యూ శాఖ కీలకం

- ఘనంగా రెవెన్యూ దినోత్సవం
- తహసీల్దార్, విశ్రాంత ఉద్యోగులకు సన్మానం



పెదబయలులో మాట్లాడుతున్న తహసీల్దార్ రామ్మోహనరావు



హుకుంపేటలో మాట్లాడుతున్న తహసీల్దార్ రవికుమార్


చింతపల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

పెదబయలు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిత్యం పనిచేసే ముఖ్య శాఖల్లో రెవెన్యూ శాఖ ఒకటని కొనియాడారు. ఈ శాఖ పౌరులకు అన్ని ప్రభుత్వ సేవలందిస్తోందన్నారు. రెవెన్యూ దినోత్సవం నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. గతంలో జరిగిన హుద్‌హుద్ తుపాను, ఏటా వచ్చే వరదలు, కరోనా కష్టకాలంలో గ్రామ స్థాయి నుంచి రెవెన్యూ సిబ్బంది ప్రాణాలకు తెగించి సేవలందించారన్నారు. రెవెన్యూ ఉద్యోగుల సేవలను కొనియాడారు. అనంతరం రిటైర్డ్ వీఆర్వో రెడ్డి సుబ్బారావును శాలువా కప్పి సన్మానించారు. అనంతరం రెవెన్యూ శాఖలో ఉత్తమ సేవలందించిన డీటీ నుంచి కింద స్థాయి సిబ్బంది వరకు ప్రశంసాపత్రాలను అందజేశారు. మండల పరిషత్ కార్యాలయం ఏఓ ఎల్.పూర్ణయ్య, ఎంఈవో కృష్ణమూర్తి, డీటీ జి.రంగారావు, వైస్ ఎంపీపీ కొర్ర రాజుబాబు, జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు మర్రిచెట్టు రామనాయుడు, మండల సర్వేయర్ కృష్ణమూర్తి, ఆర్ఐ సింహాచలం, వైస్ సర్పంచ్ గంగాధరం పాల్గొన్నారు.

హుకుంపేట: మండల కేంద్రంలోని తహసీల్దార్ పి.రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ దినోత్సవం సందర్భంగా పలువురు విశ్రాంత ఉద్యోగులను సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో రెవెన్యూ శాఖ అనేది కీలకమైనదన్నరు. రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు అనేక మేలు జరుగుతుందన్నారు. రెవెన్యూ శాఖ సిబ్బంది ప్రజలకు మరిన్ని సేవలు అందించి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని కోరారు.

ముంచంగిపుట్టు: ప్రజా ప్రత్యక్ష సేవలో రెవెన్యూ శాఖ ఎంతో కీలకం అని జిల్లా వీఆర్‌వో సంఘం ప్రధాన కార్యదర్శి సీహెచ్.రమేష్ అన్నారు. మండల కేంద్రంలో స్థానిక తహసీల్దార్ కార్యలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ రఫీజాన్‌కు రెవెన్యూ సిబ్బంది దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా వీఆర్‌వోల సంఘం ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా నిత్యం రెవెన్యూ శాఖ పని చేస్తుందన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య రెవెన్యూ శాఖ మూలస్తంభం అని అన్నారు. డీటీ అప్పలస్వామి, సర్వేయర్ టిడి భూపతి, వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిరూరల్: స్థానిక రెవెన్యూ కార్యలయంలో తహసీల్దార్ టి.రామకృష్ణ ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి రెవెన్యూ శాఖ సేవలను గుర్తుచేసుకున్నారు. తహసీల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రజా సేవలో రెవెన్యూ వ్యవస్థ ప్రత్యేక పాత్ర పోషిస్తుందన్నారు. రెవెన్యూ సేవలను గిరిజనులకు మరింత చేరువ చేసేలా ప్రతి ఒక్క రెవెన్యూ సిబ్బంది కృషి చేయాలని పిలుపునిచ్చారు. రెవెన్యూ శాఖ సిబ్బంది చేసిన సేవలను గుర్తించి సన్మానించారు. ఎంపీడీవో వీరసాయిబాబు, వీఆర్‌వో కృష్ణరావు, కృష్ణమూర్తి, నేతలు పాల్గొన్నారు.

గంగవరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ జి.ఆర్.వి.భద్రరావు ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామస్తులతో ఇన్‌చార్జి తహసీల్దార్ సమావేశాన్ని నిర్వహించి రెవెన్యూ సేవలను వివరించారు. ప్రజలకు రెవెన్యూ సిబ్బంది నిర్వహించే వివిధ విధులు, అత్యవసర సమయాల్లో చేసే కార్యక్రమాలను, రెవెన్యూ సేవలను భద్రరావు వివరించారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ జి. రాంబాబు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫయాజ్ భాషా జిలానీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: ప్రజలకు రెవెన్యూ శాఖ అందిస్తున్న అన్ని రకాల సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పి.నాగమణి అన్నారు. రెవిన్యూ దినోత్సవం సందర్భంగా అడ్డతీగలలో గురువారం ప్రజాప్రతినిధులు, ప్రజలు, రెవెన్యూ సిబ్బందితో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహిసీల్దార్ నాగమణి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు జరిగినపుడు ప్రజలు నష్టపోయిన ఆస్తులకు సంబంధించి రెవెన్యూ విభాగం ద్వారా పరిశీలించి, ప్రభుత్వానికి నివేదించి వారిని ఆర్థికంగా ఆదుకునేలా సేవలు అందిస్తామన్నారు. వివిధ ధ్రువీకరణ పత్రాల జారీ వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. రెవిన్యూ సిబ్బంది చేసే అత్యవసరమైన సేవలు ఇతరత్రా ముఖ్యమైన పనులు వంటి వాటిని వివరించారు.


ముంచంగిపుట్టులో తహసీల్దార్ రఫీజాన్‌ను సన్మానిస్తున్న సహచర ఉద్యోగులు


రెవెన్యూ సిబ్బందిని సన్మానిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో వీరసాయిబాబా


గంగవరంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ వీరభద్రరావు


అడ్డతీగలలో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగమణి

క్లుప్తంగా

నేడు డౌనూరులో యోగా డే

కొయ్యూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం డౌనూరులో యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థకు చెందిన టీచర్ గిరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, మనస్సు ప్రశాంతత కలుగుతుందన్నారు. యోగాను దినచర్యలో ఒక భాగంగా అలవర్చుకోవాలన్నారు.

నీటి పొదుపుపై అవగాహన


యార్లగడ్డలో అవగాహన ర్యాలీలో సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు

వై.రామవరం: మండలంలోని 17 సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఆయా సచివాలయాల కార్యదర్శుల ఆధ్వర్యంలో గురువారం ప్లాస్టిక్ నిషేధం, సేవ్ వాటర్ థీమ్ తదితర అంశాలపై ఎంపీడీవో కె బాపన్నదొర ఆదేశాల మేరకు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. గ్రామాల్లో వీధివీధి తిరిగి అవగాహన కల్పించారు. సచివాలయాల సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఇందుకోసం పూర్తిస్థాయిలో తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆయన సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు పూర్తిస్థాయిలో నిర్వహించాలని ఆయన సూచించారు. విశ్వకర్మ అప్లికేషన్ల త్వరతగతిన పూర్తిచేయాలని ఆయన కోరారు. ఈవోపీఆర్‌డీ పాపారావు పాల్గొన్నారు.

27న మండల సమావేశం


వై.రామవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 27 నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పూర్తి సమాచారంతో తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. మండలంలోని ప్రజాప్రతినిధులంతా ఈ సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీవో బాపన్నదొర కోరారు.

భానుడు భగభగ


గొడుగుల నీడలో వ్యాపారులు

సాక్షి,పాడేరు: మన్యంలో గత మూడు రోజుల నుంచి ఎండలు విజృంభిస్తున్నాయి. పాడేరుతో పాటు సమీప గ్రామాల్లో అధిక ఎండను తాళలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిరు వ్యాపారులు, పశువుల కాపర్లు, ఉపాధి పనులు చేసే కూలీలంతా ఎండతో అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలో ఉక్కపోతతో మరింత ఇబ్బందులు పడుతున్నారు. రోజురోజుకు పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. చిన్నారులు, వృద్ధులు ఉక్కపోతతో నానా అవస్థలు పడ్డారు. శీతల పానీయాలు, కొబ్బరి బొండాలకు గిరాకీ నెలకొంది.

పాఠశాలకు ఫర్నిచర్ వితరణ


ఓఎన్‌జీసీ అందజేసిన డ్యూయల్ డెస్కులు

రాజవొమ్మంగి: స్థానిక అల్లూరి సీతారామరాజు జెడ్పీ హైస్కూల్‌కు ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కార్పొరేషన్) రూ. 5.60 లక్షల విలువైన డ్యూయల్ డెస్కులను గురువారం అందజేసింది. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కాంపొనెంట్ నుంచి ఇందుకు అవసరమైన నిధులు సమకూర్చడం జరిగినట్టు సంస్థ ప్రతినిధులు విలేకరులకు తెలిపారు. పూర్వ విద్యార్థులు, సంస్థ అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల చిన్నారులను బడిలో చేర్పించాలి


తమలం ప్రాథమిక పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ జిల్లా కో–ఆర్డినేటర్ భాస్కరరావు

పెదబయలు: ప్రత్యేక అవసరాల(దివ్యాంగ విద్యార్థులు) పిల్లలను గుర్తించి, బడిలో చేర్పించాలని సమగ్రశిక్ష అభియాన్ జిల్లా కో–ఆర్డినేటర్ కె.భాస్కరరావు అన్నారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించి, కేంద్రం అందిస్తున్న సేవలను పరిశీలించారు. జిల్లాలో దివ్యాంగ విద్యార్థులను గుర్తించినట్టు చెప్పారు. పెదబయలు మండలంలో 30 మంది ప్రత్యేక అవసరాల విద్యార్థులను గుర్తించినట్టు తెలిపారు. వారిని వెంటనే పాఠశాలల్లో ప్రవేశం కల్పించాల సూచించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు.ఈ ఏడాది జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్లు చేపట్టాలని సూచించారు. అనంతరం స్థానిక కేజీబీవీని సందర్శించి, ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. పెదబయలు, తమలం ప్రాథమిక పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో కె.కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, భవిత సిబ్బంది రవి చంద్రభవాని తదితరులున్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


లక్ష్మీపురంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న హెచ్ఎం నీలకంఠేశ్వరరావు

ముంచంగిపుట్టు: మండలంలోనిలక్ష్మీపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో గురువారం హెచ్ఎం ఎల్.నీలకంఠేశ్వరరావు 180 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని వినియోగించుకొని క్రమశిక్షణతో చదవాలన్నారు. సబ్జెక్టుల వారీగా ప్రణాళికను రూపొందించుకొని విద్యను అభ్యసించాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను ఆర్థం చేసుకొని, ఎటువంటి సందేహాలు ఉన్న నివృత్తి చేసుకొని విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. ఉపాధ్యాయుడు బాలకృష్ణ పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఆశీలు వసూలు


వారపు సంత ఆశీలు వసూలుకు వేలం నిర్వహిస్తున్న ఎంపీడీవో కిరణ్‌కుమార్

ముంచంగిపుట్టు: వారపు సంతలో నిబంధనల ప్రకారం ఆశీలు వసూలు చేయాలని ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ అన్నారు.మండల కేంద్రంలో గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో వారపు సంత ఆశీలు వసూలు వేలంపాటను పంచాయతీ అధికారులు నిర్వహించారు.11 మంది వేలం పాటలో పాల్గొన్నారు. ఇందులో కించాయిపుట్టు గ్రామానికి చెందిన రొబ్బ గణపతి రూ.2,05,300లకు సంత వేలంపాటను దక్కించుకున్నారు.ఈ సందర్భంగా ఎంపీడీవో కిరణ్ కుమార్ మాట్లాడుతూ వారపు సంతలో ఆశీలు వసూలు పంచాయతీ నిబంధనలు పాటిస్తూ వసూలు చేయాలని, పంచాయతీ నుంచి కేటాయించిన ధరల ప్రకారం డబ్బులు వసూలు చేయాలని, సంతలో చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకోవాలని, వేలంలో పాడిన సొమ్మును మూడు దఫాలలో పంచాయతీకి చెల్లించాలని ఆయన సూచించారు. సర్పంచ్ సుభాష్‌చంద్ర, ఈవోపీఆర్‌డీవో చిన్నాన్న, పంచాయతీ కార్యదర్శి గోపి పాల్గొన్నారు.

సికిల్‌సెల్ అనీమియాపై అప్రమత్తత అవసరం


చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో సికిల్‌సెల్ అనీమియా పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

చింతపల్లిరూరల్: సికిల్‌సెల్ అనీమియాపై గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో సికిల్‌సెల్ అనీమియా వ్యాధిపై గిరిజనులకు గురువారం పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికిల్‌సెల్ అనీమియా వారసత్వంగా సంక్రమిస్తుందన్నారు. రక్త (హెచ్‌బీ) కణాల శాతం పడిపోవడం , కళ్లు పసుపు రంగులోకి మారడం, ఓళ్లు, కీళ్లు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ,అలసట, రక్తహీనత కలిగి ఉంటే సికిల్‌సెల్ అనీమియా పరీక్ష చేయుంచాలన్నారు.వ్యాధి నిర్ధారణ జరిగితే క్రమంగా మందులు వెసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరుల పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం


దారెలలో డస్ట్ బిన్‌లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ పాండురంగస్వామి

ముంచంగిపుట్టు: గ్రామాల్లో పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరం అవుతాయని దారెల సర్పంచ్ పి.పాండురంగస్వామి అన్నారు.మండలంలో గల దారెల పంచాయతీ కేంద్రంలో గురువారం స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఇంటికి రెండేసి చొప్పున డస్ట్ బిన్‌లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ పాండురంగస్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా చెత్తను సేకరించి పంచాయతీకి అందించాలని, చెత్తను డ్రైనేజీ, బహిరంగ ప్రదేశాల్లో వేయవద్దన్నారు.అపరిశుభ్రతతో దోమలు పెరిగి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, రెండు డస్ట్ బిన్‌లలో తడి, పొడి చెత్తను సేకరించాలని ఆయన ప్రజలను కోరారు. పంచాయతీ కార్యదర్శి జి.అర్జయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సామల గిరీష్‌దొర, వెల్ఫేర్ అసిస్టెంట్ గణపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి


కె.కోడాపల్లిలోని అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంఈవో బాబూరావుపడాల్

జి.మాడుగుల: అయిదు సంవత్సరాలు నిండిన పిల్లలను బడిలో చేర్పించటానికి ఉపాధ్యాయులు దృష్టి సారించాలని ఎంఈవో సీహెచ్. బాబూరావు పడాల్ చెప్పారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. మండలంలో కె.కోడాపల్లి ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, నాణ్యమైన విద్యా బోధన చేయాలని, అటెండెన్స్ తప్పనిసరిగా వేసుకోవాలని, డ్రాప్ అవుట్ పిల్లలను గుర్తించాలని ఆయన సూచించారు. ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవరించినా, సమయపాలన పాటించకపోయిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూతబడిన పాఠశాల.. విద్యార్థుల అవస్థలు

- గసరపల్లిలో తెరుచుకోని బడి
- తొమ్మిది రోజుల పాటు చిన్నారులకు అందని విద్య
- ఆందోళనలో తల్లిదండ్రులు


గసరపల్లిలో పాఠశాల తెరవకపోవడంతో బయటకు కూర్చున్న విద్యార్థులు


తెరచుకోని పాఠశాల తలుపులు

హుకుంపేట: మండలంలోని మెరకచింత పంచాయతీ డి.గసరపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వేసవి సెలవులు ముగిసినా ఇప్పటి వరకు బడి తలుపులు తెరుచుకోలేదు. దీంతో ఆ గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి సెలవులు తర్వాత పాఠశాలలు పున:ప్రారంభమైనప్పటి నుంచి ఈ రోజు వరకు పాఠశాలలు తెరవకపోతే తమ పిల్లల భవిష్యత్ ఏమవుతుందని ఆందోళన చెందుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పాఠశాలలు సకాలంలో తెరవడంతో పాటు తెరిచిన మొదటి రోజే జగనన్న విద్యా కానుకలో భాగంగా విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, బూట్లు ఇచ్చేవారని గుర్తుచేశారు. ఇప్పుడు కనీసం పాఠశాలలు తెరవకపోవడం దారుణమని, ఈ సందర్భంగా విద్యా శాఖ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇక్కడి పాఠశాలలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయుడు రిటైర్ కావడంతో ప్రస్తుతం పాఠశాలలో ఉపాధ్యాయుడు లేరని స్థానికులు చెబుతున్నారు. తమ పిల్లలు చదువుకు దూరమవుతారని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాత్కాలికంగా ఒక ఉపాధ్యాయుడిని నియమించి, తరగతులు ప్రారంభించాలని వారు కోరుతున్నారు. ఇందులో భాగంగా స్థానిక సర్పంచ్ దూసురి పద్మకుమారి ఇటీవల ఎంఈవో చెల్లయ్యను విన్నవించగా కొద్ది రోజుల్లోనే పాఠశాలలో ఉపాధ్యాయుడిని నియమిస్తామని చెప్పినట్టు సర్పంచ్ పద్మకుమారి తెలిపారు. ఈ విషయంపై ఎంఈవో చెల్లయ్యను వివరణ కోరాగా పాఠశాల ఉపాధ్యాయుడు రిటైర్ కావడంతో ఆలస్యం అయిందని సిసాయిపనుకు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడిని తాత్కాలికంగా నియమించామని, శుక్రవారం నుంచి విధులకు హాజరవుతారని తెలిపారు.

విత్తనాల పంపిణీ


మారేడుమిల్లిలో విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

మారేడుమిల్లి: మండలంలోని డి.వి.కోట, సున్నంపాడు రైతు భరోసా కేంద్రాల వద్ద ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ముందస్తుగా రైతులకు సబ్సిడీపై విత్తనాలను గురువారం పంపిణీ చేసినట్టు వ్యవసాయ ధికారి కె.వెంకటేశ్వర్లు తెలిపారు. రైతులందరూ సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసకోవాలని వారు కోరారు. ఇంకా ఎవరికైనా విత్తనాలు కావల్సిన వారు వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.


రింతాడ ఆర్‌బీకే వద్ద విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

గూడెంకొత్తవీధి: గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మండల వ్యవసాయశాఖ అధికారి మధుసూదనరావు, సీఐ అశోక్‌కుమార్ అన్నారు. రింతాడ ఆర్‌బీకే కేంద్రం వద్ద గురువారం రైతులకు రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలు పంపిణీ చేసినట్టు వారు తెలిపారు. వారికి అనుకూలమైన భూముల్లో ప్రభుత్వం అందించిన విత్తనాల ద్వారా పండించాలని సూచించారు. గంజాయి సాగును నిర్మూలించాలని కోరారు. రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కామధేనువు అమ్మవారి పండగ

మాకవరపాలెం: మండలంలోని శెట్టినాలెంలో గురువారం కామధేనువు అమ్మవారి పండగను వైభవంగా నిర్వహించారు. ఊరికి దూరంగా ఉన్న ఆలయానికి ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు చేరుకుని అమ్మవారి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.

రెండు వాహనాలు ఢీ: ముగ్గురికి గాయాలు


ఢీకొన్న వాహనాలు, గాయపడిన గిరిజనులు (ఇన్‌సెట్) చికిత్స పొందుతున్న సురేష్

చింతపల్లిరూరల్: గూడెంకొత్తవీధి మండలం మెండిగెడ్డ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనకు సంబంధించి అందిన వివరాలు ప్రకారం మెండిగెడ్డ ఆర్‌బీకే వద్ద బలపం పంచాయతీ మూలకొత్తూరు గ్రామానికి చెందిన వి.కొండబాబు, తమ్మంగుల పంచాయతీ వర్తనపల్లి గ్రామానికి చెందిన వంతల సురేష్, కొర్ర సైతమ్మ రెండు ద్విచక్ర వాహనాల్లో ఎదురెదురుగా వస్తు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సహయంతో క్షతగాత్రులను జెర్రిల పీహెచ్‌సీకీ తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందించి చింతపల్లి ఏరియా ఆస్పత్రికి పంపించారు. ఇక్కడ వైద్యులు వైద్యం అందించగా, తీవ్ర గాయాలైన కొండబాబు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. మిగిలిన ఇద్దరికి చింతపల్లి ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నారు.